

4 లో

కేంద్రమంత్రితో ఖాన్ సాహుకి ఘన స్వాగతం

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :207 సంపాదకులు: కలిచేటి వెంకయ్య బుధవారం 24 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad



## అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానం

పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

కార్యక్రమానికి హాజరైన మోదీ, అమిత్ షా

**హైదరాబాద్, సింధూరదర్శిని:** మన తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జాతీయ స్థాయిలో మరోసారి గర్వించదగ్గ గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు అత్యంత వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేశారు. ఈ విడతలో మొత్తం 47 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రదానం



మిగతా 2లో...

# రాయలసీమలో 'పసిడి' పంట

## స్వర్ణగిరిగా... ఇక జొన్నగిరి

రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి

ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు-దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత


ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ

గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన



**అమరావతి, సింధూరదర్శిని:** బంగారు నిక్షేపాల గని అంటే కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి.




రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు. ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట

మిగతా 2లో...

# హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

ఉద్యోగులకు, విద్యార్థులకు పోలీసుల కీలక అడ్వైజరీ


ఉద్యోగులు, విద్యార్థులు ముందుగానే ఇళ్లకు వెళ్లాలని పోలీసుల సూచన

సాయంత్రం 3:30 నుంచే కార్యాలయాలు మూసివేయాలని విజ్ఞప్తి

గత అనుభవాల దృష్ట్యా ట్రాఫిక్ సమస్యల నివారణకు ముందస్తు చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా జూన్ 27 వరకు వర్షాలు కురిసే అవకాశం

**హైదరాబాద్, సింధూరదర్శిని:** తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వ సమస్యలను నివారించేందుకు గాను కీలక సూచనలు జారీ చేశారు. సైబరాబాద్ పరిధిలోని కంపెనీలు, ఇతర కార్యాలయాలు, విద్యాసంస్థలు సోమవారం నుంచి సాయంత్రం 3:30 గంటల నుంచే ఉద్యోగులను, విద్యార్థులను విడతల వారీగా ఇళ్లకు పంపాలని సూచించారు.



భారత వాతావరణ శాఖ కథనం ప్రకారం, రాష్ట్రంలో జూన్ 27 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జూన్ 24 వరకు ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గతంలో భారీ వర్షాల కురిసిన సమయంలో గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో


మిగతా 2లో...

## అమరావతిలో కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు పర్యటన

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం

కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు

సీఎం చంద్రబాబు విజన్‌తో అమరావతి నిర్మాణం వేగంగా సాగుతోంది: కేంద్ర మంత్రి



**అమరావతి సింధూర దర్శిని:** కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోకన్ సాహుతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం సీఆర్డీయే కార్యాలయంలో రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ రంగాల్లో అమలవుతున్న పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎండీ అరుణ్ కుమార్, టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్

మిగతా 2లో...

# మునికూడలికి మహర్దశ

మోడల్ పుష్కర్ పంచాయత్ అభివృద్ధికి అడుగులు - పవన్ కళ్యాణ్ గారి చొరవతో దాదాపు రూ. 7 కోట్ల అభివృద్ధి నిధులు

అధునాతన పుష్కర ఘాట్, రోడ్లు, డ్రెయిన్లు, పారిశుధ్య నిర్వహణ సదుపాయాలతో పర్యాటక శోభ

మొట్టమొదటి జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీగా మునికూడలి - పర్యావరణహితంగా 'సప్త రుషి' ఘాట్

**అమరావతి, సింధూరదర్శిని:** 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాల' థీమ్ తో మోడల్ పుష్కర పంచాయతీల రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు, ఆ దిశగా పని ప్రారంభించారు. సీతానగరం మండల పరిధిలోని మునికూడలి గ్రామంలో మోడల్ పుష్కర్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల సమన్వయంతో దాదాపు రూ. 7 కోట్ల నిధులు మంజూరు చేయించారు. 'సప్త రుషి ఘాట్' ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు మునికూడలి గ్రామ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుధ్య నిర్వహణ, పర్యాటక ఆకర్షణల మేళవింపుతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ మొత్తం నిధులను వినియోగించనున్నారు. దేవాదాయ శాఖ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వ ఆమోదం లభించింది. గోదావరి కాలుష్య నివారణ పనులకు పీసీబీ నిధులు ఖర్చు చేయనున్నారు. అందులో మునికూడలి సప్త రుషి పుష్కరఘాట్ సమీపంగా ఉన్న ఉమాపార్వతీ



సోమేశ్వరస్వామి వారి ఆలయం, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునరుద్ధరణ, మరమ్మతుల నిమిత్తం దేవాదాయ శాఖ రూ. 30 లక్షలు మంజూరు చేసింది. పుష్కరాల సందర్భంగా విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా నాణ్యమైన కరెంటు అందించేందుకు వీలుగా 11కేవీ ఫీడర్ తో పాటు అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, లో టెన్షన్ లైన్ల నిర్మాణం, ఇతర పనుల నిమిత్తం రూ. 1.41 కోట్లు, సప్త రుషి ఘాట్ కి ఇరువైపులా ఉన్న గోదావరి గట్టుపై సిమెంటు రోడ్డు నిర్మాణం, మునికూడలి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ర్యాంపుల నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి రూ. 1.23 కోట్లు వెచ్చించనున్నారు. మునికూడలి రాష్ట్రంలో మొట్టమొదటి జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీగా అవతరించనుంది. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం మునికూడలి గ్రామం నుంచి విడుదల అయ్యే మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవకుండా గ్రామంలో గ్రామంలో 3.4 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. వాటికి అనుసంధాన రహదారులు, సామాజిక ఇంకుడు గుంతలు, వ్యక్తిగత

మిగతా 2లో...

# మునికూడలికి మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)

ఇంకుడు గుంతల నిర్మాణం, మొక్కలు నాటడం తదితర పనులకు రూ. 68.2 లక్షలు మంజూరయ్యాయి. దీంతోపాటు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ నిధులతో సప్త రుషి ఘాట్ దగ్గర 20 శాశ్వత మరుగు దొడ్ల నిర్మాణం, గ్రామంలో చెత్త సేకరణ నిమిత్తం ఎలక్ట్రికల్ వాహనం ఏర్పాటు చేయనున్నారు. మరో రూ. 10 లక్షలు వెచ్చించి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని నిర్మించనున్నారు. పూర్తి పారిశుధ్యంతో కూడిన వాతావరణం మధ్య పుష్కరాలు నిర్వహించుకునే విధంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. గోదావరి కరకట్ట, పుష్కరఘాట్ సమీపంలో రూ. 4 లక్షలతో పొదల తొలగింపు ప్రక్రియ చేపట్టనున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం నిధులతో సప్త రుషి ఘాట్ కి వచ్చే భక్తులకు, మునికూడలి గ్రామ తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 15 లక్షలు, పంచాయతీరాజ్ శాఖ నిధులతో గ్రామం మొత్తం వీధి దీపాలు, ఏర్పాటు చేయనున్నారు. రూ. 1.78 కోట్లతో సప్త రుషి ఘాట్ లో పుష్కరాల నిమిత్తం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తారు. పుష్కరాల సందర్భంగా రాత్రి సమయాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీ ఫోకస్ లైట్లు, సుందరీకరణ దీపాల ఏర్పాటుకు రూ. 20 లక్షలు వెచ్చించనున్నారు. రూ. 15 లక్షలతో రెండు పింఢ ప్రదానం షెడ్లు నిర్మించనున్నారు.  మర్రిచెట్టు ఆకారంలో ఏర్పాటు చేయనున్న టెర్రకోట డయాస్ పెయింటింగ్, బస్ షెల్టర్ నిర్మాణానికి రూ. 10 లక్షలు, మరో రూ. 5 లక్షలతో పాత పాఠశాల భవనం మరమ్మతులు చేపట్టనున్నారు. వీటితోపాటు పుష్కరాల కోసం తరలివచ్చే భక్తులు సౌకర్యార్థం పార్కింగ్ ప్రదేశాలు, పుష్కరఘాట్, ఆలయాలకు వెళ్లే మార్గాల వివరాలతో కూడిన సైన్ బోర్డులు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ఘాట్ సమీపంలో దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణానికి, జల్లు స్నానం ఏర్పాట్లకు రూ. 25 లక్షలు ఖర్చు చేయనున్నారు. సప్త రుషి పుష్కరఘాట్ కి వచ్చే భక్తులకి పారిశుధ్యం, పచ్చదనం, స్వచ్ఛదనంతో కూడిన మెరుగైన సౌకర్యాలు అందేలా పనులు చేపట్టనున్నట్టు ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో మునికూడలి త్వరలో మోడల్ పుష్కర్ పంచాయత్ గా రూపుదిద్దుకోనుంది.

# హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉద్యోగులందరూ ఒకేసారి కార్యాలయాల నుంచి బయటకు రావడం వల్ల కలిగే రద్దీని నివారించేందుకే ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు నగరంలో భారీ వర్షం నమోదు కానప్పటికీ, రానున్న రోజుల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానం

(మొదటిపేజీ తరువాయి)

చేయగా.. అందులో మన టాలీవుడ్ లెజెండ్స్ ఉండటం విశేషం.

నాలుగు దశాబ్దాలుగా వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో, హాస్యంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్.. కళారంగానికి చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. నటుడిగా, నిర్మాతగా 'జయభేరి' బ్యానర్‌పై అద్భుతమైన చిత్రాలు నిర్మించడమే కాకుండా, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మురళీమోహన్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుకు ఉద్యోగ సంఘాల ధన్యవాదాలు



అమరావతి, సింధూరదర్శిని కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు మేలు చేసేలా తీసుకున్న నిర్ణయాలపై  ఉద్యోగ సంఘాలు నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీల్లో ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62కు పెంపు, 2004 సెప్టెంబర్ కు ముందు నోటిఫికేషన్లతో నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు వివిధ ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా తీసుకున్న వివిధ నిర్ణయాలతో తాము ఊరట పొందుతున్నామని ఉద్యోగ సంఘ నేతలు సీఎంకు వివరించారు. సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న వివిధ సమస్యల పరిష్కారంతో ఉద్యోగులకు, ఉద్యోగుల కుటుంబాలకు ఎంతో లబ్ది కలుగుతోందని వెల్లడించారు. రాష్ట్రం ఆర్ధికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికీ మరువలేమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజల కోసం ఉద్యోగులు పని చేయాలని సీఎం ఉద్యోగ సంఘాల నేతలకు సూచించారు. ఉద్యోగ సంఘాలన్నీ కలిసి కట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, ప్రసాద్, ఏపీ సచివాలయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, నాపా ప్రసాద్ సహా సీపీఎస్, పీఎస్ యూ ఉద్యోగుల అసోసియేషన్, గురుకుల, సొసైటీలు, డీఎస్సీ–2003 ఉపాధ్యాయుల సంఘానికి చెందిన నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలియచేశారు.

# అమరావతిలో కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు పర్యటన


(మొదటిపేజీ తరువాయి)

ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, చైర్మన్ పట్టాభిరామ్‌తో పాటు హడ్కో, మెప్మా, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో పురపాలక, గృహ నిర్మాణ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రస్తుత స్థితి, మెప్మా ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రఅభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణానికి రూపొందించిన విజన్‌ను అభినందించారు. ఆధునిక సౌకర్యాలు, సమగ్ర ప్రణాళికతో అమరావతి దేశంలోనే ఆదర్శవంతమైన రాజధానిగా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలకు సేవలందిస్తున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కారణంగా అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా అమలవుతున్నాయని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సహాయ మంత్రి స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి విజయ్‌పై ఉదయనిధి వ్యక్తిగత విమర్శలు.. అసెంబ్లీలో విడాకుల ప్రస్తావన!

**విజయ్ విడాకుల కేసును పరోక్షంగా ప్రస్తావించిన ప్రతిపక్ష నేత – కోర్టులో భార్య కోసం భార్య వెతికే కథ తెలుసన్న ఉదయనిధి**

**ఈ విషయం తమిళ ప్రజలకు తెలుసని వ్యాఖ్య – డీఎంకే పాలన, కుటుంబ రాజకీయాలపై విజయ్ విమర్శలకు కౌంటర్**




సింధూరదర్శిని: తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరుకున్నాయి. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష నేత, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్.. ముఖ్యమంత్రి విజయ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు. ముఖ్యమంత్రి విజయ్ విడాకుల అంశాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించడంతో సభలో తీవ్ర దుమారం రేగింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వాగ్వాదం చోటుచేసుకుంది. తొలుత ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, హిందీ వివాదం, నీట్, రైతుల నిరసనలు, కరూర్ తొక్కిసలాట వంటి పలు అంశాలను ప్రస్తావించారు. రైతులను ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయని, తమ ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. గత డీఎంకే ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించిందని విమర్శించారు. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ హావభావాలను అనుకరిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అనంతరం ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజయ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. రైతుల గౌరవాన్ని దెబ్బతీసేలా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం వల్లే రైతులు నిరసనలు తెలుపుతున్నారని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఉదయనిధి తన ప్రసంగంలో "ఒక చిన్న కథ చెబుతా" అంటూ.. చెంగల్‌పట్టు కోర్టులో తన భర్త కోసం ఓ భార్య వెతుకుతోందని, ఈ విషయం తమిళ ప్రజలందరికీ తెలుసని పేర్కొంటూ విజయ్ వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి విజయ్ భార్య సంగీత, ఫిబ్రవరి 24న చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 7న జరగనుంది. ముఖ్యమంత్రి విజయ్ తన ప్రసంగంలో డీఎంకే నేతృత్వంలోని గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం నేతల వలె తాము ప్రజాధనాన్ని దోచుకోమని స్పష్టం చేశారు. అలాగే ఒక కుటుంబానికే ప్రాధాన్యత ఇవ్వడం తమ రాజకీయ విధానం కాదని, తమిళనాడులోని ప్రతి కుటుంబానికి సేవలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

**– పచ్చిమేత కొరత నివారణకు చర్యలు – వర్షాభావాన్ని అధిగమించేందుకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రణాళిక**

**– కరపత్రాలను విడుదల చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి, సింధూరదర్శిని: రాష్ట్రంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో పశు సంపద రక్షణ, పశుపోషకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పశువులకు పచ్చిమేత కొరత తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పశు సంవర్ధక శాఖ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పశు గ్రాసాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా "ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ (ప్రీవీణా)" విధానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంతో పాటు పశుసంపదపై కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు, పశుపోషకులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను అనుసరించడం ద్వారా మెరుగైన పశు గ్రాస దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చిమేత లభ్యత, పశుగ్రాస నిల్వ, తాగునీటి వసతులు, పశు సంరక్షణ చర్యలపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కరపత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా రైతులు, పశుపోషకులకు ఈ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పశుసంపద పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా పశుపోషకులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ద్వారా పశుసంపదను సంరక్షించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పశుపోషకులకు అవగాహన కల్పించేందుకు ఈ కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు, శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాయలసీమలో 'పసిడి' పంట

(మొదటిపేజీ తరువాయి)

తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

**ప్రారంభోత్సవం... శంకుస్థాపన**

కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్‌తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.



## విద్యార్థులకు ర్యాక్ వితరణ

### టిడిపి నాయకులు నెల బల్లి భాస్కర్ రెడ్డిని ఘనంగా సత్కరించిన లైన్స్ క్లబ్

గూడూరు ( సింధూర దర్శిని) 23 జూన్ నెల్లూరు జిల్లా ; లైన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆ క్లబ్ అధ్యక్షులు అక్కన రమణయ్య తెలియజేశారు. టిడిపి రాష్ట్ర నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి రతృత్వంతో నెల్లటూరు జడ్పీ హైస్కూల్ కు 10వేల రూపాయలు విలువచేసే ర్యాక్‌ను అందజేశారు.గూడూరు రూరల్ పరిధిలోని నెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర నాయకులు, లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ నెలబల్లి భాస్కర్ రెడ్డి దాత్రుత్వంతో 10వేల రూపాయలు విలువచేసే విద్యార్థులకు అవసరమయ్యే ర్యాక్ ను అందజేశారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ అక్కన రమణయ్య మాట్లాడుతూ...లైన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం దాత భాస్కర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఆర్. రవిచంద్ర, ట్రెసరర్ వీరేంద్రనాద్,హెచ్ఎం పార్వతమ్మ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని నిరసన



గూడూరు ( సింధూర దర్శిని) 23 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో గూడూరు డిపో నందు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రమణ రాజు మధుసూదన్ రెడ్డి జోనల్ నాయకులు వెంకయ్య డిపో ప్రెసిడెంట్ శ్రీనివాసులు డిపో సెక్రటరీ ప్రవీణ్ గ్యారేజ్ సెక్రటరీ పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీఏ నడపాలని, మూసివేసిన డిపోలను తెరిపించాలని, పిఆర్సి కమిటీ వేయాలని , ఐఆర్ ప్రకటించాలని, డిఏ బకాయిలు చెల్లించాలని ,కొత్త బస్సులు 4000 వేయాలని, 15వేల ఉద్యోగ పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

## పూడికతీత పనులను పరిశీలించిన డ్వామా పీడీ



గూడూరు ( సింధూర దర్శిని) 23 జూన్ నెల్లూరు జిల్లా ; జల దారా - జల హారతి కార్యక్రమంలో భాగంగా నెల్లూరు డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్వామా పిడి మాట్లాడుతూ చిల్లకూరు మండల పరిధిలోని కమ్మవారిపాలెం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పంట కాలువ పనులను తనిఖీ చేశారు. అంతేకాకుండా సెవెన్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో హుండీ లెక్కింపు

### ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం ( సింధూర దర్శిని) 23 జూన్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి హుండీ లెక్కింపు ద్వారా 21 రోజులకు రాబడిన ఆదాయం - 1,74,41,363/- రూపాయలు, బంగారం - 23.గ్రాముల వెండి - 1, కిలో 650 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా 14,599 రూపాయలు. నిత్య అన్నదానం హుండీ ద్వారా - 1,86,581/- రూపాయలు.

ఫారిన్ కరెన్సీ ;U.S.A - 504. Dollars. UAE -15. Dirhams. Singapore - 10. Dollars. England - 10. Pounds. Saudi - 10. Riyals. ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెంచల కిషోర్ తెలిపారు.ఈ హుండీ లెక్కింపులో పాల్గొన్నవారు, డిఈఓ సాగర్ బాబు, చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు - ఎస్వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు - కోదండపాణి, శ్రీధర్ బాబు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెల పండగ బందోబస్త్ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సమీక్ష




నెల్లూరు ( సింధూర దర్శిని) 23 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర ప్రాముఖ్యత కలిగిన బారా షాహిద్ దర్గా రొట్టెల పండగ బందోబస్త్ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల జిల్లా పోలీస్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు.కుల, మతాలకు అతీతంగా నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక పండగకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సౌజన్య రొట్టెల పండగ బందోబస్తులో పాల్గొనే ఇంచార్జి అధికారుల వివరాలు, వారి విధులు మరియు నిర్వహించాల్సిన ముఖ్యమైన బాధ్యతలను ఎస్పీ కి వివరించారు.నెల్లూరు టౌన్ దీక్ష , దర్గామిట్ట పోలీస్ స్టేషన్ ఇంచార్జి గా ఉన్న నవాబ్ పేట ద్వారా బందోబస్తు సెక్టార్ల వారీగా టోపోగ్రఫీ, భద్రతా ఏర్పాట్లను వివరించారు.రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు కసుమూరు దర్గా, ఇందుకూరుపేట మరియు కృష్ణపట్నం పరిధిలోని బీచ్ ప్రాంతాల్లో చేపట్టనున్న బందోబస్తు ఏర్పాట్లను తెలియజేశారు.అదేవిధంగా సౌత్ ట్రాఫిక్ సీఐ సమగ్ర ట్రాఫిక్ సెక్యూరిటీ ప్లాన్, కటాఫ్ పాయింట్లు, పార్కింగ్ జోన్లు, నోటీసు బోర్డులు, ఆర్టీసీ సమన్వయం, ప్రెజర్ పాయింట్ల నిర్వహణపై పి పి టి ద్వారా ఎస్పీ కి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

దర్గా ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో :
సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ
డ్రోన్ సర్వైలెన్స్
కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటు
ప్రత్యేక పార్కింగ్ జోన్లు, నోటీసు బోర్డుల ఏర్పాటు

క్యూఆర్టి టీమ్స్, బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్స్ వినియోగం తో పాటు సెక్టార్ వారీగా పటిష్టమైన బందోబస్తు చేపట్టాలని సూచించారు. మిస్సింగ్ పిల్లల గుర్తింపు కోసం ఐడి ట్యాగ్స్ వినియోగించాలని, వృద్ధులు మరియు ప్రత్యేక అవసరాలు కలిగిన భక్తులకు ఘాట్ ప్రాంతంలో రొట్టెల మార్పిడి సమయంలో పోలీస్ సేవాదళ్ ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఘాట్ ఏరియా మరియు బోటింగ్ పాయింట్ల వద్ద లైఫ్ సేవింగ్ ఎక్విప్‌మెంట్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బందోబస్తులో పాల్గొనే సిబ్బందికి వసతి మరియు భోజన సౌకర్యాలు సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. గంధం ఊరేగింపు, క్యూ లైన్ల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ అప్పారావు, ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, చంద్రమోహన్, హోంగార్డ్ యూనిట్ రామకృష్ణ, టౌన్ మరియు రూరల్ ఇన్స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమం పై ఎంపీడీవో మధుసూదన్ సమన్వయ సమావేశం



గూడూరు ( సింధూర దర్శిని) 23. జూన్ నెల్లూరు జిల్లా ; జాతీయ పల్స్ పోలియో జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం. జ్యోతి అధ్యక్షత వహించగా, ఎంపీడీవో మధుసూదన్, సీడీపీఓ ఎస్.కె. మహబూబి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల పరిధిలోని 0--5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైద్యాధికారులు పిలుపునిచ్చారు.కార్యక్రమ షెడ్యూల్

జూన్ 28: పోలియో బూత్‌లలో చుక్కలు వేయడం.

జూన్ 29: బూత్‌లకు రాని పిల్లలకు ఇంటింటి సర్వే ద్వారా పోలియో చుక్కలు వేయడం. జూన్ 30: మిగిలిన పిల్లలందరికీ వందశాతం పోలియో చుక్కలు అందించడం. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, మారుమూల ప్రాంతాల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ సమావేశంలో, ఎంపీహెచ్ఈఓ వి.వరప్రసాద్, ఎంఎంపీహెచ్ఎస్ నల్లిబోయిన మస్తానయ్య, హెల్త్ అసిస్టెంట్ గడ్డం నాగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



గూడూరు( సింధూర దర్శిని) 23 జూన్ నెల్లూరు జిల్లా ; జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, పోలీసు అధికారుల పర్యవేక్షణలో మంగళవారం సాయంత్రం గూడూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ దండోరా కాలనీలో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

ఈ ఆపరేషన్‌కు గూడూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో 15 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొని విస్తృత తనిఖీలు చేపట్టింది.ఆపరేషన్ సందర్భంగా పోలీసు బృందం ప్రాంతంలోని నివాసాలు, పరిసర ప్రాంతాలు మరియు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసింది. వాహనాల రికార్డులను పరిశీలించి ధృవీకరించారు. తనిఖీలలో ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు లేదా నేరాలకు సంబంధించిన అంశాలు గుర్తించబడలేదు. అనంతరం స్థానిక ప్రజలు, యువత మరియు కాలనీ పెద్దలకు రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అక్రమ మద్యం నిర్మూలన, మహిళలు మరియు చిన్నారుల భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఆస్తి సంబంధిత నేరాల నివారణ, డయల్-100 మరియు 112 అత్యవసర సేవల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణ కోసం జిల్లాలో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడుతున్నాయని పోలీసులు తెలిపారు.

## గణపయ్యను దర్శించుకున్న ప్రముఖులు: ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం( సింధూర దర్శిని) 23 జూన్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ మరియు రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ , స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , మరియు దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోడౌన్లు తనిఖీ

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్ వెంకటేశ్వర్



రేణిగుంట( సింధూర దర్శిని) 23 జూన్ తిరుపతి జిల్లా ; జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24ఇ7 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచబడిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, సి డబ్ల్యూ సి గోదామును మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్స్ లు గోడౌన్లో భద్రపరచడం జరిగిందని, ప్రతి నెల మరియు మూడు నెలలకు ఒకసారి గోడౌన్ లోపల పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈవీఎం గోడౌన్ లోపల మరమ్మతులు ఏమైనా ఉన్నాయా అన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈరోజు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సందర్శించడం జరిగిందన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ అవసరాలు సరి చూసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాష్ రెడ్డి, ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి మరియు జి ఎన్ ఎస్ ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, రేణిగుంట శ్రావణ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ప్రశంసాపత్రాలు: కలెక్టర్



తిరుపతి ( సింధూర దర్శిని) 23 జూన్ తిరుపతి జిల్లా ; క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ మరియు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున స్కాలర్‌షిప్‌లు మరియు ప్రశంసాపత్రాలను మంజూరు చేశారు. మంగళవారం తిరుపతి జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఈ తరహా ప్రోత్సాహకాలు వారికి మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థుల్లో చంద్రగిరికి చెందిన ఎస్. ప్రణవి, సాయి హర్షిణి, ఎన్. అక్షయ్, రైల్వే కోడూరుకు చెందిన పీ. మోక్షిత, ఎస్. సురేఖ శ్రావణి, వెంకటగిరికి చెందిన సి. హెచ్. రోహిత, శ్రీకాళహస్తికి చెందిన ఎన్. జెస్సిక, జె. సుబ్రహ్మణ్యమ్మ. ఈ కార్యక్రమంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ తరఫున డివిజనల్ మేనేజర్ ఎం. జగదీష్, లియాజన్ ఆఫీసర్ ఎస్. ఆరిఫుల్లా, ఏరియా మేనేజర్లు ఈ. సిద్ధారెడ్డి, వై. సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలి



జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్

తిరుపతి (సింధూరదర్శిని) 23 జూన్ తిరుపతి జిల్లా ; ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన మరియు జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడంలో తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయాలు విశిష్ట ఫలితాలను సాధిస్తున్నాయని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. ప్రభుత్వ సేవలపై ప్రజల అభిప్రాయాలను అంచనా వేయుటకు నిర్వహించబడుతున్న ఫీడ్‌బ్యాక్ వ్యవస్థలో, మోటారు వాహన తనిఖీ అధికారి చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం గత రెండు నెలలుగా వరుసగా 100 శాతం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (పి3) నమోదు చేసి రాష్ట్రంలో వరుసగా రెండు సార్లు ప్రథమస్థానం పొందడం విశేషమని అదేవిధంగా, మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర నాయుడి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం 96 శాతం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ నమోదు చేసి రాష్ట్రంలో ద్వితీయ స్థానం పొందడం కూడా ప్రశంసనీయమని తెలిపారు.

ఈ ఫలితాలు సంబంధిత మోటార్ వాహనాల తనిఖీ అధికారులు, సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతకు, వారి అంకితభావానికి, క్రమశిక్షణకు మరియు సేవా దృక్పథానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శక మరియు మర్యాదపూర్వక సేవలు అందించడంతో పాటు, సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం వల్లనే ఈస్థాయి ప్రజాదరణ లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి చంద్రశేఖర్ మరియు శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి దామోదర్ నాయుడు మరియు సిబ్బందిని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మెమంటో బహుకరించి సత్కరించారు ఇదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించి, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వారి సూచనల మేర "ప్రజల సంతృప్తి మరియు విశ్వాసమే ప్రభుత్వ సేవల విజయానికి నిజమైన కొలమానం అని మరియు ప్రజా సేవలో నిబద్ధత, పారదర్శకత మరియు జవాబుదారీతనంతో వ్యవహరించడం ద్వారా ప్రజల ఆదరణను మరింత పెంపొందించుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు.

# క్రైం న్యూస్




## చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

భారీ గృహ చోరీ కేసును ఛేధించిన వేదాయపాలెం పోలీసులు

నిందితుడి అరెస్ట్ – రూ.11.88 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం

నెల్లూరు ( సింధూర దర్శిని) 23 జూన్ నెల్లూరు జిల్లా ; జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఆదేశాలు, అడిషనల్ ఎస్పీ సౌజన్య మార్గదర్శకత్వం, నెల్లూరు టౌన్ ఎస్ డి పి ఓ , ఏ ఎస్ పి దీక్ష, పర్యవేక్షణలో వేదాయపాలెం పోలీసులు భారీ గృహ చోరీ కేసును విజయవంతంగా ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.157/2026, సెక్షన్లు 331(4), 305(ఎ) బీఎన్ఎస్ కింద నమోదు చేసిన కేసులో, గుర్తుతెలియని వ్యక్తులు నెల్లూరు రూరల్ మండలం రెవెన్యూ కాలనీలోని మూడు అంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో ఉన్న తాళం వేసిన ఇంటి గ్రిల్ గేటు తాళం మరియు కిటికీ గ్రిల్స్ తొలగించి, ఇంట్లోని బీరువాలో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు.

కేసు దర్యాప్తు చేపట్టిన వేదాయపాలెం పోలీసు బృందం 22.06.2026 తేదీన నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరు హైవే రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పు శివనారాయణ (31), తండ్రి చెంచయ్య, వడ్డెర, ప్రస్తుతం కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, నెల్లూరు రూరల్ మండలం నివాసి, స్వగ్రామం వడ్డేపాలెం, ఇడిమేపల్లి గ్రామం, వెంకటగిరి మండలం వాసిని గుర్తించారు. పోలీసులను గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా, చోరీకి గురైన మొత్తం ఆస్తి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు.

**స్వాధీనం చేసుకున్న ఆస్తి**

సుమారు 162.5 గ్రాముల బంగారు ఆభరణాలు -- విలువ రూ. 11,37,500/-

సుమారు 340 గ్రాముల వెండి వస్తువులు -- విలువ రూ. 51,000/-

మొత్తం విలువ: రూ. 11,88,500/-

నిందితుడు చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పలు చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి, దొంగిలించిన ఆస్తిని పూర్తిగా రికవరీ చేసిన నెల్లూరు టౌన్ ఏ ఎస్ పి దీక్ష , వేదాయపాలెం పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల అభినందించారు.

## అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు

గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ

గూడూరు (సింధూర దర్శిని) 23 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం చిల్లకూరు మండల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ పోలీసులు మాట్లాడుతూ కొమరావారి పాలెంలో నిర్వహించిన తనిఖీలలో నాసిన మునెయ్య అనే వ్యక్తి దగ్గర అక్రమంగా నిలవ ఉంచిన ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, అతనిపై సంబంధిత చట్టాల ప్రకారం బెల్ట్ షాప్ కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ



ప్రదేశాలలో మద్యం సేవించడం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ఎక్సైజ్ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుందని, ప్రజలు ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక తనిఖీలలో ఎస్సై పి. మహేష్ , కానిస్టేబుల్ శ్రీరాములు , మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రమంత్రితో ఖాన్ సాహుకి ఘన స్వాగతం

రేణిగుంట ( సింధూర దర్శిని) 23 జూన్ తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి తోఖాన్ సాహు మంగళవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందించి సాధర స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి జూన్ 23, 24 తేదీలలో తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి , పొంగూరు నారాయణ కేంద్ర మంత్రితో పాటు జిల్లాకు విచ్చేశారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద వీరికి కూడా సాధర స్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో కూడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, హౌసింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## విశ్వహిందూ పరిషత్ జిల్లాస్థాయి శిక్షణ తరగతులు నిర్వహణ

బాపట్ల, సింధూరదర్శిని:
బాపట్ల జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో జిల్లా సాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కల రామిరెడ్డి గారిని సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా భజరంగ్ దళ్ అధ్యక్షుడు (ప్రాముఖ్) నాళం నరేష్ పాల్గొని ప్రసంగించారు. హిందువులందరూ ఐకమత్యంతో ఉండాలని, సమాజ శ్రేయస్సు కోసం ఒకే వేదికపై కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. హిందూ సమాజం బలోపేతానికి అనుసరించాల్సిన పలు సూచనలను కార్యకర్తలకు వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొని సంస్థ లక్ష్యాలు, సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన పొందారు.

## మావుళ్ళమ్మ స్వర్ణ వస్త్రం కోసం ఈనెల 25న ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

భీమవరం, సింధూరదర్శిని: భీమవరం ఆరాధ్యదేవత శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి 100 కేజీల బంగారంతో స్వర్ణ వస్త్రాన్ని రూపొందించే కార్యక్రమంలో భాగంగా ఈనెల 25న ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక బంగారు చీర కౌంటర్‌ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. భీమవరం (రాజధానితుళ్ళూరు) భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో దేవస్థానం, స్వర్ణ వస్త్ర నిధి కమిటీ సభ్యులతో కలిసి "సంపూర్ణ స్వర్ణ అమ్మవారి ప్రాజెక్ట్" బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారికి స్వర్ణ వస్త్రం తయారీ కోసం మొత్తం 100 కేజీల బంగారం అవసరమవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 50 కేజీల బంగారంతో వివిధ ఆభరణాలు తయారు చేసినట్లు, మరో 23 కేజీల బంగారం దేవస్థానం వద్ద అందుబాటులో ఉందని తెలిపారు. రెండో విడతలో ఈ 23 కేజీల బంగారంతో స్వర్ణ అలంకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. స్వర్ణ వస్త్రం పూర్తి చేయడానికి ఇంకా 27 కేజీల బంగారం అవసరమని, ఇందుకు దాతల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భక్తులు, దాతల విరాళాల సేకరణ కోసం జూన్ 25న ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సహకారంతో మావుళ్ళమ్మ అమ్మవారి స్వర్ణ వస్త్ర ప్రాజెక్ట్‌ను త్వరలో పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో, చైర్మన్, పాలకవర్గ సభ్యులు, స్వర్ణ వస్త్ర ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## పొద్దుటూరు హాస్పిటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ కు పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలి.

**కార్తికేయ ఏజెన్సీని బ్లాక్లిస్టులో పెట్టాలి**

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్**



కడప సింధూరదర్శిని:
కడప వైఎస్ఆర్ జిల్లా పొద్దుటూరు పట్టణంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్లో ఉన్న దాదాపు ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని ,అలాగే కార్తికేయ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ డిమాండ్ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యక్షంగా ఎమ్మెల్యే ఆందోళనకు దిగడం శుభపరిణామం అని తెలిపారు .జిల్లా అంతా ఇదే పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా 18600/ గాను 13960/ రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, దాదాపు కేవలం 118 00/ఇవ్వడం దుర్మార్గమని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ, సక్రమంగా చెల్లించకపోవడం మరింత దారుణమని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా కడప జిజిహెచ్ మొదలుకొని మైదుకూరు, పొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, వేంపల్లి, కమలాపురం ,రాజంపేట, బద్వేల్ కనుక జిల్లా అధికారులు జోక్యం చేసుకొని పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే కోణంలో కార్మికులను నిలువు దోపిడీ చేసే కార్తికేయ ఏజెన్సీ కాంట్రాక్టర్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## నేడు గుంటుపల్లి పోలేరమ్మ తిరుణాళ్ల మహోత్సవం



బల్లికురవ, సింధూరదర్శిని: మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వేంచేసియున్న సట్టు పోలేరమ్మ తల్లి ఐదవ వార్షిక తిరుణాల మహోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఐదు సంవత్సరాల కాలంలో ఏడాదికోరకంగా అమ్మవారి ఆలయం అభివృద్ధిలో ముందుంటుంది. ఆలయ ధర్మకర్త మాదాల వీరమ్మ దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి పరచటంలో తన ప్రత్యేకతను చాటుకుంటారు. ఈ సందర్భంగా వేకువజాము నుండి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ అభిషేకాలు, అలంకరణలు కొనసాగుతాయి. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, విద్యుత్ ప్రభ ఏర్పాటుతోపాటు అన్న వితరణ కార్యక్రమాలు కొనసాగుతాయి. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి అమ్మవారి భక్తులు తిరుణాల మహోత్సవానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

# ప్రతి కుటుంబానికి బీమా రక్షణ కవచం

**ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2 లక్షల లబ్ధి - ఖాతాదారులంతా బీమా పథకాల్లో చేరాలి - చీఫ్ మేనేజర్ సీనా నాయక్**



అద్దంకి సింధూరదర్శిని:అనుకోని ప్రమాదాలు, కుటుంబ పెద్దల ఆకస్మిక మరణాలు సంభవించినప్పుడు ఆర్థికంగా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, అలాంటి పరిస్థితుల్లో బీమా పథకాలు కుటుంబాలకు అండగా నిలుస్తాయని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సీనా నాయక్ పేర్కొన్నారు. బల్లికురవలోని బ్యాంక్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమం లో సంతమాగులూరు మండలం నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన బండి వెంకాయమ్మకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఆమె భర్త నాగయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో సభ్యుడిగా ఉండటంతో కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం అందింది. ఈ సందర్భంగా సీనా నాయక్ మాట్లాడుతూ, స్వల్ప ప్రీమియంతో లభించే కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు గ్రామీణ కుటుంబాలకు భరోసానిస్తాయని, ప్రతి బ్యాంకు ఖాతాదారుడు తప్పనిసరిగా బీమా పథకాల్లో చేరాలని సూచించారు. ప్రస్తుతం అనేక కుటుంబాలు బీమా ప్రాధాన్యతను గుర్తించకపోవడం వల్ల ప్రమాదాలు లేదా ఆకస్మిక మరణాల సమయంలో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొం టున్నాయని తెలిపారు. కుటుంబ భవిష్యత్తు భద్రత కోసం బీమా ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని, ముఖ్యంగా రోజువారీ ఆదాయంపై ఆధారపడే కుటుంబాలకు ఇది అత్యంత అవసరమని వివరించారు. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందుగానే బీమా తీసుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ కె. సహిత గ్రేస్, అసిస్టెంట్ మేనేజర్ జి. బిందు మాధవి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్, యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీగా కవలకుంట్ల మధుబాబు నియామకం



బద్వేల్.సింధూరదర్శిని:
పోరుమామిళ్ల,జూన్ 23ప్రజావాణి సుదీర్ఘ కాలంగా ప్రజాసేవలో ఉంటూ,బలమైన రాజకీయ మరియు సామాజిక నేపథ్యం కలిగిన ప్రముఖ నాయకులు కవలకుంట్ల మధు బాబుకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఆయన సమాజానికి అందిస్తున్న నిస్వార్థ సేవలను గుర్తిస్తూ 'నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ ఱ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా' సంస్థకు జాతీయ స్థాయి జాయింట్ సెక్రటరీ) గా నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.జ్యోతిస్వర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.కవలకుంట్ల మధు బాబు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా,నిరంతరం అనేక సేవా కార్యక్రమాలతో సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.ముఖ్యంగా వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ,వారితో స్వయంగా కలిసి కూర్చుని సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం ఆయన మానవత్వానికి నిదర్శనం.అలాగే వృద్ధుల సంరక్షణే ధ్యేయంగా వారికి ఉచితంగా దుస్తులు పంపిణీ చేయడం,అనాథాశ్రమాల్లోని పిల్లలకు ఆహారంతో పాటు స్వీట్లు పంచుతూ వారి ముఖాల్లో ఆనందాన్ని నింపడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను ఆయన నిరంతరం నిర్వహిస్తున్నారు. ఇలాంటి సేవాతత్పరతను పరిగణనలోకి తీసుకునే ఈ కీలక పదవికి ఆయనను ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా ఈ నియామకంపై కవలకుంట్ల మధు బాబు హర్షం వ్యక్తం చేస్తూ,తనపై నమ్మకంతో జాతీయ స్థాయి బాధ్యతలను అప్పగించిన సంస్థ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.తనకున్న రాజకీయ,సామాజిక అనుభవంతో సమాజంలో అవినీతి నిర్మూలనకు,మానవ హక్కుల రక్షణకు గట్టిగా కృషి చేస్తానని చెప్పారు.భవిష్యత్తులో కూడా అనాథలు,వృద్ధులు,మరియు వెనుకబడిన వర్గాల హక్కుల రక్షణ కోసం,వారి శ్రేయస్సు కోసం సంస్థ పరంగా మరిన్ని సేవా కార్యక్రమాలు విరివిగా చేపడతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.మధు బాబు నియామకం పట్ల పలువురు రాజకీయ విశ్లేషకులు,సామాజిక కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

## ప్రభుత్వజీతాలు తీసుకుంటూ కోచింగ్ వ్యాపారం..!

**చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్**



బద్వేల్ సింధూరదర్శిని:
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయాల్సిన కొందరు ఉపాధ్యాయులు "సంకల్ప కోచింగ్", "ఐఐటీ అకాడమీ", "సైనిక్-నవోదయ-ఆర్ఎంఎస్ కోచింగ్" పేర్లతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తూ విద్యను వ్యాపారంగా మార్చారని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అనిల్ తీవ్రంగా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ జీతాలు తీసుకుంటూనే తల్లిదండ్రుల ఆశలు, విద్యార్థుల భవిష్యత్తును పెట్టుబడిగా మార్చుకుని భారీ మొత్తాల్లో ఫీజులు వసూలు చేయడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉన్నవారు, అదే విద్యను ప్రైవేట్ కోచింగ్ రూపంలో అమ్ముకోవడం విద్యా వ్యవస్థకు మచ్చ అని విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉచితంగా అందాల్సిన మార్గదర్శకత్వాన్ని డబ్బులు చెల్లించే వారికి మాత్రమే పరిమితం చేయడం సామాజిక అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన ఉపాధ్యాయులే కోచింగ్ సెంటర్లను ప్రోత్సహించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవా నియమావళిని ఉల్లంఘిస్తూ కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే సంబంధిత ప్రభుత్వ ఉద్యోగుల పేర్లతో సహా జిల్లా విద్యాశాఖాధికారి )కి ఫిర్యాదు చేస్తామని అనిల్ స్పష్టం చేశారు. "విద్యార్థుల భవిష్యత్తు బంగారు గని కాదు... విద్యను అమ్ముకునే మార్కెట్ కాదు. విద్య సేవగా ఉండాలి. దానిని వ్యాపారంగా మార్చే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి" అని అనిల్ హెచ్చరించారు.

## బాపట్లలో విస్తృత పర్యటన చేసిన కమిషనర్ హాసిని



బాపట్ల సింధూరదర్శిని:
బాపట్ల పురపాలక కమిషనర్ హాసిని పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి త్రాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, అన్న క్యాంటీన్, వీధికుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. త్రాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. భీమవారిపాలెంలో రహదారి పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైలుపేటలోని స్టెరిలైజేషన్ కేంద్రాన్ని సందర్శించి జంతు సంక్షేమ ప్రమాణాలు పాటించాలని సూచించారు. 6వ వార్డులో డ్రైనేజీ సమస్యలను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడం పురపాలక సంఘం లక్ష్యమని కమిషనర్ తెలిపారు.



## విద్యుత్ స్ట్రగుల్ కమిటీ నిరసన కార్యక్రమం

**పి ఆర్ సి కమిటీ వెంటనే వేయాలి**

**కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలి**

బద్వేల్ సింధూరదర్శిని:బద్వేల్ సెక్షన్ నందు స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు వనిపెంట ప్రసాద్, సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్య క్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగుల ఏప్రిల్ 2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో 3కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సబ్స్టేషన్లు ప్రైవేటీకరణ నిలుపు దల చేయాలని వారు డిమాండ్ చేశారు. యాజమాన్యం వెంటనే స్పందించి, ఉద్యోగులలో, కార్మికులతో వున్న అశాంతిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్ర మంలో దశరథ, రామచంద్రుడు, లోకేష్, అబ్దుల్ వలీ,ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కడపలో 53 లక్షల విలువైన 48 సిఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కడప సింధూరదర్శిని:కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) కింద మంజూరైన రూ.53 లక్షల విలువ గల 48 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందిం చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# 2030 నాటికి భారతీయులు ఎక్కువగా ఖర్చు చేసేది వీటి కోసమేనట!

-2030 నాటికి అనుభవాలపై ఖర్చు మరింత పెరిగే అవకాశం

-ట్రావెల్, హోటళ్లు, రెస్టారెంట్లకు అధిక ప్రాధాన్యం

-వస్తువుల కంటే అనుభవాలపై ఎక్కువ ఆసక్తి

-హోటల్ ఖర్చులు 10.6% వృద్ధితో పెరిగే అంచనా

-జెన్‌జీ తరం ఈ మార్పుకు ప్రధాన కారణం

ఒకప్పుడు కొత్త ఫోన్, టీవీ, ఫర్నీచర్ కొనడం అనేవి ముఖ్యమైన విషయాలు. ఇప్పుడు మాత్రం చాలామంది డబ్బును వస్తువుల కంటే అనుభవాల కోసం ఖర్చు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రయాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. రాబోయే ఐదేళ్లలో ఈ ధోరణి మరింత బలపడనుందని రియల్ ఎస్టేట్ సేవలు, పెట్టుబడుల సంస్థ సీబీఆర్‌ఈ రీసెర్చ్ అధ్యయనం చెబుతోంది. 2030 నాటికి భారతీయులు వస్తువుల కంటే అనుభవాలపైనే ఎక్కువగా ఖర్చు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

### ప్రయాణాలకే పెద్ద పీట

ఈ నివేదిక ప్రకారం 2025-2030 మధ్య కాలంలో భారతీయుల అనుభవాలపై (ఎక్స్‌పీరియెన్సెస్) ఖర్చు వేగంగా పెరగనుంది. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, పర్యటనలపై వ్యయం వార్షికంగా 10.3 శాతం వృద్ధి రేటుతో పెరుగుతుందని అంచనా వేసింది. ఇక భౌతిక వస్తువులపై ఖర్చు 9.1 శాతం వృద్ధి రేటుతో పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా హోటల్ వసతి ఖర్చులు 10.6 శాతం వృద్ధితో మరింత వేగంగా పెరుగుతాయని నివేదిక పేర్కొంది.

### జెన్‌జీ ప్రభావం

ఈ మార్పునకు ప్రధాన కారణం జెన్‌జీ తరమేనని నివేదిక వెల్లడించింది. సోషల్ మీడియాలో పంచుకునేలా ప్రత్యేక అనుభవాలు, ఆకర్షణీయమైన ప్రదేశాలు, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే హోటళ్లకు యువత ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణ వసతి కంటే ప్రత్యేక అనుభూతిని అందించే లైఫ్‌స్టైల్ హోటళ్లకు డిమాండ్ పెరుగుతోంది. వైన్ టేస్టింగ్, సంగీత కార్యక్రమాలు, స్థానిక కళా ప్రదర్శనల వంటి కార్యక్రమాలు నిర్వహించే హోటళ్లను యువ పర్యాటకులు ఎక్కువగా ఎంచుకుంటున్నారు.

### కొత్త ట్రెండ్‌గా లైఫ్‌స్టైల్ హోటళ్లు

ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 2015 నుంచి 2025 మధ్య మొత్తం హోటళ్ల సంఖ్య 5 శాతం వృద్ధి రేటుతో పెరిగితే, లైఫ్‌స్టైల్ హోటళ్లు 19 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2030 వరకు కూడా ఈ విభాగం వేగంగా విస్తరించే అవకాశముందని నివేదిక తెలిపింది. భారత్‌లో ఈ తరహా హోటళ్ల సంఖ్య ఇంకా తక్కువగానే ఉండటంతో పెట్టుబడిదారులు, డెవలపర్లకు విస్తృత అవకాశాలు ఉన్నాయని విశ్లేషించింది. ఇప్పటికే ఉన్న హోటళ్లను ఆధునిక లైఫ్‌స్టైల్ హోటళ్లుగా మార్చే ధోరణి కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

# బల్లిని చూసి కొంతమంది ఎందుకు అంతలా భయపడిపోతారు?

మెదడు హెచ్చరిక వ్యవస్థే అసలు కారణం - చిన్ననాటి జ్ఞాపకాలూ భయాన్ని పెంచుతాయి

కుటుంబ ప్రభావం కూడా కీలకమే - ఆకస్మిక కదలికలతో ఆందోళన

కొందరిలో ఫోబియాగా మారే ప్రమాదం - చికిత్సతో భయాన్ని అధిగమించే అవకాశం

గోడపై ఓ చిన్న బల్లి కనిపించగానే కొందరు గదినే ఖాళీ చేస్తారు. మరికొందరు అరుస్తూ బయటకు పరుగులు తీస్తారు. 'అది ఏం చేయదు కదా' అని చెప్పినా వారి భయం మాత్రం తగ్గదు. అసలు బల్లులను చూసి కొందరు ఎందుకు అంతలా భయపడతారు? దీనికి వెనుక మన మెదడు, అనుభవాలు, చిన్ననాటి జ్ఞాపకాలు కీలక పాత్ర పోషిస్తాయని మానసిక ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**మెదడు ఇచ్చే హెచ్చరిక**

బల్లులు వేగంగా కదలడం, అకస్మాత్తుగా కనిపించడం చాలామందిలో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ప్రమాదం లేకపోయినా మెదడు దాన్ని ఒక ముప్పుగా భావించి 'ఫైట్ ఆర్ ఫ్లైట్' ప్రతిస్పందనను యాక్టివేట్ చేస్తుంది. దీంతో గుండె వేగంగా కొట్టుకోవడం, చెమటలు పట్టడం, వణుకు రావడం, అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలనే భావన కలుగుతుంది. కొందరిలో ఇది భయం కంటే అసహ్యం లేదా విరక్తి రూపంలో కూడా కనిపించవచ్చు.



**చిన్ననాటి అనుభవాల ప్రభావం**

ఈ భయం చాలా సందర్భాల్లో చిన్నప్పుడే మొదలవుతుంది. ఇంట్లో పెద్దలు బల్లిని చూసి భయపడటం, అరవడం చూసి పిల్లలు కూడా అదే ప్రవర్తనను నేర్చుకునే అవకాశం ఉంటుంది. అలాగే బల్లి ఒక్కసారిగా మీద పడటం లేదా దగ్గరగా కనిపించడం వంటి అనుభవాలు మెదడులో బలమైన జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. ఆ జ్ఞాపకాలు పెద్దయ్యాక కూడా భయాన్ని కొనసాగిస్తాయి.

**ఎప్పుడు ఫోబియాగా మారుతుంది?**

బల్లిని చూసి ఒక్కసారి భయపడటం సహజం. కానీ బల్లి ఉంటుందేమోనని గదుల్లోకి వెళ్లకుండా ఉండటం, గోడలు పదేపదే పరిశీలించడం, ఒంటరిగా ఇంట్లో ఉండలేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడితే అది ఫోబియాగా మారినట్లే. అయితే దీనికి చికిత్స ఉందని మానసిక నిపుణులు చెబుతున్నారు. కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (సీబీటీ), క్రమంగా భయాన్ని తగ్గించే ఎక్స్‌పోజర్ థెరపీ వంటి పద్ధతులతో ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

# 11ఏళ్ల పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వొచ్చా? అంటే ఏఐ సమాధానం ఇదీ!

-11 ఏళ్ల పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వడంపై పెరుగుతున్న ఆందోళన

-చాట్ జీపీటీని అడిగితే, ఐదు సంకేతాలు గమనించాలని సూచన

-మూడింటికి పైగా నెగెటివ్ సంకేతాలు కనిపిస్తే ఇవ్వకపోవడమే మంచిదని సూచన




పదకొండేళ్ల ప్రాయంలో పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు ఇవ్వాలా వద్దా అనే అంశంపై తల్లిదండ్రులలో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. తోటి స్నేహితుల ఒత్తిడి, పాఠశాల గ్రూప్ చాట్స్ వంటి కారణాలతో పిల్లలు ఫోన్ల కోసం పట్టుబడుతుండగా, ఇది వారి ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు, ఇటీవలి పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి.

కేవలం వయసును మాత్రమే కాకుండా, పిల్లల ప్రవర్తనా సంసిద్ధతను ప్రామాణికంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. "11 ఏళ్ల లోపు పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వవచ్చా?" అని ఏఐ టూల్ 'చాట్‌జీపీటీ'ని బెంగళూరుకు చెందిన ఉద్యోగి ఒకరు విశ్లేషించగా, పిల్లల్లో ఈ క్రింది ఐదు సంకేతాలను గమనించాలని అది సూచించింది.

1. మారాం చేయకుండా డివైజ్‌ను తిరిగి ఇచ్చేయడం
2. స్క్రీన్ అందుబాటులో లేకపోయినా సమయాన్ని ఉల్లాసంగా గడపగలగడం
3. స్నేహితుల ఒత్తిడికి తలొగ్గకుండా ఉండటం
4. తమ ఫోన్ వాడకం గురించి ఏ విషయాలూ దాచకుండా బహిరంగంగా చెప్పడం
5. సమయ పరిమితులను అంగీకరించడం...

వీటిలో కనీసం మూడు అంశాల్లో ప్రతికూలతలు కనిపిస్తే, పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు పునరాలోచించుకోవాలని చాట్‌జీపీటీ పేర్కొంది.

ఈ అభిప్రాయాలకు ఇటీవలి పరిశోధనలు సైతం బలం చేకూరుస్తున్నాయి. 11 ఏళ్లలోపే వయసులోనే స్మార్ట్‌ఫోన్ వాడటం మొదలుపెట్టిన పిల్లల్లో డిప్రెషన్, ఊబకాయం, నిద్రలేమి వంటి సమస్యలు అధికంగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా బాలికలలో ఆత్మహత్య ఆలోచనలు, మానసిక అస్థిరత వంటి ఆందోళనకర ధోరణులు పెరుగుతున్నట్లు ఈ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, పిల్లలకు నేరుగా స్మార్ట్‌ఫోన్ ఇచ్చే కంటే సమాచార మార్పిడి కోసం తొలుత బేసిక్ ఫోన్ లేదా స్మార్ట్‌వాచ్‌లను అందించడం సురక్షితమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాత్రి వేళల్లో ఫోన్‌ను బెడ్‌రూమ్‌కు దూరంగా ఉంచడం, భోజన సమయంలో ఫోన్ వాడకాన్ని నిషేధించడం, వినోదం కోసం రోజుకు 60 నుంచి 90 నిమిషాలకు మించి అనుమతించకపోవడం వంటి కఠినమైన నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని వారు తల్లిదండ్రులకు

# ఏనుగు పేడతో కాఫీ.. ఒక్క కప్పు ధర రూ.4,700!

ఏనుగు పేడ నుంచి సేకరించిన గింజలతో కాఫీ తయారీ - 'బ్లాక్ ఐవరీ కాఫీ'గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

ఒక్క కప్పు ధర దాదాపు రూ.4,700 - కిలో ధర 2,000 డాలర్ల వరకు ఉండొచ్చు

థాయ్‌లాండ్‌లో పరిమిత స్థాయిలో ఉత్పత్తి - ఏనుగుల జీర్ణవ్యవస్థలో సహజ ప్రాసెసింగ్



కాఫీ అంటే చాలా మందికి ఇష్టం. ఉదయం ఓ కప్పు కాఫీతో రోజును ప్రారంభించే వాళ్లు కోట్లలో ఉంటారు. కానీ ఒక కప్పు కాఫీ ధర రూ.4,700 దాటితే? అదీ ఏనుగు పేడ నుంచి సేకరించిన గింజలతో తయారైతే? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇదే ప్రపంచంలో అత్యంత అరుదైన, ఖరీదైన కాఫీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

### ఏంటీ బ్లాక్ ఐవరీ కాఫీ?

థాయ్‌లాండ్‌లో తయారయ్యే 'బ్లాక్ ఐవరీ కాఫీ' ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ రకాలలో ఒకటి. దీని ధర కిలోకు దాదాపు 2,000 డాలర్ల వరకు ఉంటుంది. ఒక్క కప్పు కాఫీ ధరే సుమారు 50 డాలర్లు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.4,700కు పైమాటే. ఈ కాఫీ ప్రత్యేకత ఏంటంటే... గింజలను ఏనుగుల జీర్ణవ్యవస్థ ద్వారా ప్రాసెస్ చేస్తారు.

### తయారీ విధానం ఇదే

కాఫీ గింజలను బియ్యం, అరటిపండ్లు, ఇతర పండ్లతో కలిపి ఏనుగులకు ఆహారంగా ఇస్తారు. ఆహారం జీర్ణమయ్యే సమయంలో కాఫీ గింజలు కూడా ప్రత్యేక ప్రక్రియకు లోనవుతాయి. 15 నుంచి 17 గంటల తర్వాత ఏనుగుల మల విసర్జన నుంచి ఆ గింజలను సేకరించి శుభ్రపరుస్తారు. అనంతరం వాటిని ప్రాసెస్ చేసి కాఫీ తయారు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల కాఫీకి ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తుందని కాఫీ ప్రియులు చెబుతున్నారు.

### అంత ఖరీదెందుకు?

ఈ కాఫీ తయారీ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతుంది. గింజల సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలో అధిక శ్రమ అవసరం. అలాగే ఉత్పత్తి పరిమితంగా ఉండటం కూడా ధర పెరగడానికి కారణం. కాఫీలో చాక్లెట్, నట్స్, మట్టి వాసనల మిశ్రమ రుచి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఏనుగుల ఆరోగ్యానికి హాని కలగకుండా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామని తయారీ సంస్థలు పేర్కొంటున్నాయి.

# కుటుంబంతో కలిసి ఆడండి.. మెదడుకు పదును పెట్టండి!

కుటుంబంతో కలిసి వ్యాయామం చేస్తే మెదడు చురుకుదనం

పిల్లల్లో జ్ఞాపకశక్తి మెరుగుపడినట్లు అధ్యయనంలో గుర్తింపు

పెద్దల్లో సమాచార ప్రాసెసింగ్ సామర్థ్యం పెరుగుదల

45 నిమిషాల ఆటలతోనే ప్రయోజనాలు

తల్లిదండ్రులు, పిల్లలు ఒకరికి ఒకరు ప్రేరణగా మారుతున్న వైనం

వ్యాయామం తర్వాత ఇన్సులిన్ వినియోగం తగ్గినట్లు గుర్తింపు



పిల్లలతో కలిసి కాసేపు ఆటలు ఆడటం కేవలం సరదాకే కాదు.. మెదడు పనితీరును మెరుగుపరచడానికి కూడా ఉపయోగపడుతుందని తాజా అధ్యయనం చెబుతోంది. కుటుంబ సభ్యులంతా కలిసి చేసే శారీరక వ్యాయామం జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని పెంచుతుందని పరిశోధకులు గుర్తించారు.

ప్రపంచవ్యాప్తంగా చాలామంది తగినంత శారీరక శ్రమ చేయడం లేదని పరిశోధకులు చెబుతున్నారు. పెద్దల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు, ప్రతి ఐదుగురు పిల్లల్లో నలుగురు కనీస వ్యాయామం చేయడం లేదని వెల్లడించారు. దీనివల్ల మధుమేహం వంటి వ్యాధులతో పాటు మెదడు పనితీరుపైనా ప్రభావం పడుతోంది.

ఈ నేపథ్యంలో పరిశోధకులు 24 కుటుంబాలతో మాట్లాడి, శారీరక కార్యకలాపాలకు అడ్డంకులు ఏంటో అధ్యయనం చేశారు. ఖర్చులు, సమయం లేకపోవడం ప్రధాన కారణాలుగా తేలాయి. అయితే పిల్లలు చురుగ్గా ఉంటే తల్లిదండ్రులు కూడా ప్రేరణ పొందుతున్నారని, అదే విధంగా తల్లిదండ్రులు వ్యాయామం చేస్తే పిల్లలు కూడా వారిని అనుసరిస్తున్నారని గుర్తించారు.


దీంతో కుటుంబ సభ్యులందరూ కలిసి పాల్గొనగలిగేలా 'ట్యాగ్ రగ్బీ' ఆధారంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. 16 కుటుంబాలు ఇందులో పాల్గొన్నాయి. 45 నిమిషాల పాటు వ్యాయామం, ఆటలు ఆడిన తర్వాత వారి శారీరక, మానసిక సామర్థ్యాలను పరీక్షించారు.

ఫలితాలు ఆసక్తికరంగా ఉన్నాయి. వ్యాయామం చేసిన తర్వాత తల్లిదండ్రుల శరీరం ఆహారాన్ని జీర్ణం చేసేందుకు తక్కువ ఇన్సులిన్‌ను ఉపయోగించినట్లు గుర్తించారు. పిల్లల్లో వర్కింగ్ మెమరీ మెరుగుపడగా, పెద్దల్లో సమాచారాన్ని వేగంగా అర్థం చేసుకుని స్పందించే సామర్థ్యం పెరిగింది. ఈ ప్రభావం కనీసం 45 నిమిషాల వరకు కొనసాగినట్లు పరిశోధకులు తెలిపారు. అయితే ఇది చిన్న స్థాయి అధ్యయనం మాత్రమేనని, దీర్ఘకాల ప్రయోజనాలపై ఇంకా పరిశోధనలు అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. అయినప్పటికీ కుటుంబ సభ్యులు కలిసి చేసే ఫిజికల్ యాక్టివిటీస్ ఆరోగ్యంతో పాటు మెదడు పనితీరుకూ మేలు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.



## మీరు ఉదయం అరగంట నడిస్తే
# మీకు కనీసం పది ప్రయోజనాలు

సైన్స్ అండ్ టెక్నాలజీ జీవితాన్ని ఎంతగానో ఆధునీకరించాయి. మనమందరం ఇప్పటికీ టెక్నాలజీ ఉచ్చులో చిక్కుకున్నాము. సాంకేతికత మన రోజువారీ పది పనులను సులభతరం చేస్తున్నందున, యంత్రాలకు అవసరం లేని అన్ని శారీరక పనులను మనం నియంత్రించుకుంటాము. మన వృద్ధాప్యంలో, ప్రజలు ఎక్కువగా ఆరోగ్యంగా ఉండాలి మరియు ఆరోగ్యం మరియు ఫిట్నెస్ కోసం విడిగా సమయం మరియు డబ్బు ఖర్చు చేయవలసిన అవసరం లేదు. ఇప్పుడు ప్రాణాంతకమని నిరూపించబడిన వ్యాధులు చాలా అరుదు. మన పెద్దలు ఆరోగ్యంగా ఉన్నందున, వారి ఆహారం సేంద్రీయమైనది మరియు వారు తగినంత ఆహారాన్ని తినడం లేదు. మన పూర్వీలు చాలా కష్టపడేవారు మరియు వారికి నడక మరియు వ్యవసాయ ఆధారిత వ్యాయామాలు తప్ప వేరే వ్యాయామం తెలియదు. నడక అనేది మనిషి శరీరానికి అత్యంత సరైన వ్యాయామం. ఏదైనా ఇతర బాడీబిల్డింగ్ వ్యాయామం శరీరంపై అనారోగ్య ఒత్తిడిని కలిగిస్తుంది. అందువల్ల, మీరు కృత్రిమ ఆరోగ్యం కాకుండా రోజుకు



కేవలం ముప్పై నిమిషాలు నడవడం ద్వారా సాధారణ ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్‌ను సాధించవచ్చు, వీటిని ఖరీదైన వ్యాయామ పరికరాలు, జిమ్ లు మరియు మరెన్నిటి ద్వారానో సాధించవచ్చు. నడకతో సాధారణ అనుభూతి చెందారా? నడక శరీరంలోని అన్ని కండరాలకు మంచి వ్యాయామం ఇస్తుంది మరియు ఎక్కువ కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది. మన జీవితంలో సరళమైన విషయాలు గొప్ప ఆనందాన్ని అందించినట్లే, సాధారణ వ్యాయామాలు మన ఆరోగ్యానికి గొప్పప్రయోజనాన్ని అందిస్తాయి. కాబట్టి నడక ఆరోగ్యానికి కీలకం అని సులభంగా చెప్పవచ్చు. రండి, అరగంట నడక యొక్క మొదటి పది ప్రయోజనాలను పరిశీలిద్దాం ... నడక మన హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది క్రమం తప్పకుండా నడవడం వల్ల మన హృదయ స్పందన రేటు కొద్దిగా పెరుగు తుంది. కానీ అతిగా కాదు. ఇది ప్రసరణను కొంచెం మెరుగుపరుస్తుంది, కానీ శ్వాస అంత వేగంగా కాదు. కాబట్టి కొంచెం ఎక్కువ ప్రసరణ గుండెపై ఎక్కువ ఒత్తిడి చేయకుండా రక్తపోటును ఆరోగ్యకరమైన పరిమితుల్లో ఉంచడానికి సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. జీవరసాయన క్రియను






ఉత్తమంగా ఉంచుతుంది నడక జీర్ణవ్యవస్థను అవసరమైనంతగా ప్రేరేపిస్తుంది మరియు ఎక్కువ జీర్ణ అవసరాలను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఇది ఆహారాన్ని పూర్తిగా జీర్ణం చేయడానికి మరియు తద్వారా జీవరసాయన పనితీరును మెరుగుపరచడానికి సహాయపడుతుంది. విరేచనాలతో నిండిన ఆహారాలు జీర్ణక్రియ మరియు దానితో వచ్చే సమస్యల నుండి మిమ్మల్ని రక్షిస్తాయి. ఎముకలు బోలు సమస్యల నుండి రక్షిస్తుంది ఎముకలు సాధారణ నడక ద్వారా స్థిరీకరించబడతాయి మరియు సులభంగా చిరిగి పోకుండా కాపాడుతుంది. శరీరంలో అధిక విటమిన్ డి 3 ఉత్పత్తి అవుతుంది, ముఖ్యంగా సూర్యుని యువ కిరణాలు తీసుకున్నప్పుడు. ఈ విటమిన్ ఆహారంలో కాల్షియం మొత్తాన్ని గ్రహించడంలో సహాయపడు తుంది. ఇది ఎముకల ఎముకలలో మజ్జ ఎండిపో కుండా నిరోధి స్తుంది. ఇది ఆర్థరైటిస్ నుండి రక్షణను అందిస్తుంది. కండరాలు గట్టిగా ఉండటానికి సహాయపడు తుంది రోజుకు ఒకసారి నడవడం కండరాలను నిర్మించడానికి మరియు శరీరంలో కండరాల-కొవ్వు నిష్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఫలితం వక్రీకృత కండరాలను పొందగలుగుతుంది. తొడలు మరియు ముంజేయి యొక్క కండరాలు, ముఖ్యంగా, వ్యాయామ పాఠశాలల్లో కంటే చెమట మరియు అలసటతో మెరుగ్గా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది నడక మన శరీరంలో ఎక్కువ తెల్ల రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది మరియు తద్వారా రోగ నిరోధక శక్తిని మెరుగుపరు స్తుంది. రోజూ క్రమం తప్పకుండా మరియు ఒక రోజు లేకుండా అరగంట పాటు నడిచే రోగులు చాలా ఆరోగ్యంగా.. ఉత్తమంగా ఉంటారు మరియు జలుబు మరియు దగ్గు జ్వరం వచ్చే ఇతరులకన్నా తక్కువ. మెదడు కండరాలను ప్రేరేపిస్తుంది నడవడం ద్వారా మెదడు కణాల కార్యకలాపాలను పెంచుతుంది. మెదడు కణజాల నష్టం మరియు వినికిడి నష్టం మరియు జీవన నాణ్యత కోల్పోకుండా జ్ఞాపకశక్తి కోల్పోకుండా కాపాడుతుంది. క్రమం తప్పకుండా నడవడం జ్ఞాపకశక్తిని మెరుగు పరుస్తుంది మరియు అల్జీమర్స్ వ్యాధి, మెదడు రుగ్మతతో సహా ఇతర వ్యాధుల నుండి రక్షిస్తుంది. అప్రమత్తంగా ఉండటానికి మీకు సహాయపడుతుంది రొటీన్ నడక ద్వారా అనేక అనారోగ్యాలను నివారించవచ్చు. తద్వారా శరీరం మరియు






మనస్సు మంచి స్థితిలో ఉంటాయి మరియు నడక ద్వారా అదనపు ప్రసరణ ద్వారా రక్త ఆక్సిజన్‌ను తీసుకువెళ్ళే సామర్థ్యం ఉంటుంది. అధిక ఆక్సిజన్ అధిక కార్యాచరణ మరియు అప్రమత్తతను నిర్వహించడానికి సహాయపడు తుంది. శరీరం నుండి మలినాలను తొలగించడానికి సహాయపడుతుంది మన శరీర కండరాలన్నీ కదలికలో ఉన్నప్పుడు, ఇతర అవయవాలు మలినాలను కరిగించడంలో పాల్గొంటాయి. నడక సమయంలో, ప్రేగులలో కార్యకలాపాలు వేగవంతమవు తాయి మరియు మలినాలు పెద్ద ప్రేగులోకి కదులుతాయి. మలినాలను శరీరం నుండి విడుదల చేసినప్పుడు, శరీరం యొక్క సామర్థ్యం పెరుగుతుంది. నడక మనకు సంతోషాన్ని ఇస్తుంది మీ ఇంటికి సమీపంలో ఉన్న పార్కులో లేదా మీకు ఇష్టమైన ప్రదేశంలో ప్రతిరోజూ అరగంట పాటు నడవడం మనస్సు యొక్క ఒత్తిడిని తగ్గిస్తుంది మరియు మెదడులో ఆక్సిటోసిన్ ఉత్పత్తి చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గిస్తుంది. తత్ఫలితంగా, నిరాశకు గురయ్యే అవకాశం తక్కువ. మనస్సు యొక్క స్థితిని తొలగిస్తుంది మరియు మీకు సుఖంగా ఉండటానికి సహాయపడుతుంది. బలాన్ని పెంచుతుంది ఒక అధ్యయనం ప్రకారం అరగంట క్రమం తప్పకుండా నడుస్తూ ఆరోగ్య కరమైన ఆహారనియమాలు పాటించేవారు ఇతరులకన్నా ఐదు నుంచి ఏడు సంవత్సరాలు తక్కువ వయస్సున్న వారిలా కనబడుతారు. కొన్ని అనారోగ్యాలు నడకతో కప్పబడవు, అందుకే అవి బరువు తగ్గుతారు. రెగ్యులర్ అరగంట నడక శరీర బరువును తగ్గిస్తుంది మరియు జీవితాన్ని పూర్తిస్థాయిలో జీవించటానికి మిమ్మల్ని అనుమతిస్తాయి. ఈ కథనాన్ని మీ స్నేహితులతో పంచుకోండి, తద్వారా వారు ఈ వ్యాసంలో ఉపయోగ కరమైన సమాచారాన్ని పొందవచ్చు.



# హైదరాబాద్‌లో భారీ చోరీ.. ఏటీఎంకు తెచ్చిన రూ.17లక్షలు మాయం!

**హైదరాబాద్ ఐఎస్ సదన్‌లో ఏటీఎం నగదు చోరీ - వ్యాన్ డ్రైవర్ పరారీ.. కుమ్మక్కుపై పోలీసుల అనుమానం**

**బైక్‌పై వచ్చి నగదు ట్రంకును ఎత్తుకెళ్లిన దుండగులు - సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**



హైదరాబాద్, సింధూరదర్శిని: హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకువచ్చిన సుమారు రూ.17 లక్షల నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఓ క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది ఏటీఎంలో నగదు నింపేందుకు వ్యాన్‌లో అక్కడికి చేరుకున్నారు. సిబ్బంది ఏటీఎం కియోస్క్‌లోకి వెళ్లిన సమయంలో, ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి వ్యాన్‌లో ఉన్న నగదు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ కూడా పరారీ కావడంతో, అతడు దొంగలతో కుమ్మక్కై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రధానంగా డ్రైవర్ పాత్రపైనే దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే ఈ తరహా చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది: కేటీఆర్

**రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్**

**సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ**

**రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపణ**



హైదరాబాద్, సింధూరదర్శిని: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. "కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.


# సినిమా న్యూస్



తాజా ఆకర్షణీయమైన చిత్రంలో సహజ సౌందర్యంతో అందరి మనసులను గెలుచుకున్న ప్రిషా ఆర్ సింగ్. మృదువైన సహజ కాంతి మరియు ఆహ్లాదకరమైన చిరునవ్వుతో కూడిన ఈ బహిరంగ ప్రదేశపు చిత్రంలో, సున్నితమైన అలంకరణలు కలిగిన పీచ్ రంగు టాప్‌లో ప్రిషా ఆర్ సింగ్ ఎంతో సహజమైన అందంతో కనిపిస్తున్నారు.

## చావా- దర్శకుడి –ఈత- టీజర్ నర్తకిగా శ్రద్ధా లుక్‌కి ఫిదా

ఒక నిజ ఘటనను అద్భుతమైన సినిమాటిక్ బ్రిలియన్సీ తో వెండితెరపై ఆవిష్కరిస్తే, అది నిజంగా ప్రజల్ని రంజింపజేస్తుందనడానికి ఇటీవల ఎన్నో సినిమాలు ఉన్నాయి. ఇప్పుడు అదే తరహాలో నిజ ఘటనల ఆధారంగా ఒక నర్తకి జీవితంపై తీస్తున్న సినిమా బాలీవుడ్ లో చర్చగా మారింది. ఈ చిత్రాన్ని స్త్రీ2, చావా లాంటి భారీ చిత్రాల్ని అందించిన దినేష్ విజన్ తన బ్యానర్ లో నిర్మిస్తుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. చావా లాంటి బ్లాక్ బస్టర్ కి దర్శకత్వం వహించిన లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటం మరింత ఆసక్తిని పెంచుతోంది. విఠాభాయి నిజజీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా విడుదలైన టీజర్‌లో విఠాభాయి నృత్యం కోసం పడిగాపులు పడే ఆ కాలాన్ని విజువలైజ్ చేసిన తీరు ఎంతో మనోహరంగా, అద్భుతంగా ఉంది. స్టేజీపై ఎంతమంది నర్తకులు ఉన్నా.. ఈత కోసం వేచి చూస్తున్నారు అంతా. అసలింతకీ ఎవరా ఈత? ఆమె కథేమిటన్నది తెరపైనే చూడాల్సి ఉంటుంది. వేదికపై పెర్ఫామెన్స్ కోసం సిద్ధమైన విఠాభాయి స్టేజీ వెనక ఒంటరిగా బిడ్డను ప్రసవించే సన్నివేశాన్ని చూపించడం నిజంగా ఎమోషన్ కి గురి చేస్తోంది. కొంత సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నా.. లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రాన్ని ఒక క్లాసిక్‌గా మలుస్తున్నారని టీజర్ చెబుతోంది. మహారాష్ట్ర కు చెందిన ప్రముఖ లావణి జానపద నృత్యకారిణి, గాయని అయిన విఠాబాయి నారాయణ గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. -స్త్రీ 2- అఖండ విజయం తర్వాత శ్రద్ధా కపూర్ నటిస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన ఈ టీజర్ ప్రారంభంలోనే ఉద్వేగాన్ని రేకెత్తించే సన్నివేశాన్ని చూపించారు. వేలాది మంది ప్రేక్షకులు ఒక బహిరంగ వేదిక వద్ద జానపద నృత్య ప్రదర్శనను చూడటానికి గుమిగూడతారు. వారంతా -ఈత- ప్రదర్శన ఇవ్వాలంటూ గట్టిగా డిమాండ్ చేస్తుండగా.. స్టేజీ వెనక



ఒక గర్భిణీ స్త్రీ ప్రసవ వేదనతో అరుస్తున్న శబ్దం వినిపిస్తుంది. ఆమె మరెవరో కాదు.. గొప్ప ప్రజాదరణ పొందిన నృత్యకారిణి ఈత (శ్రద్ధా కపూర్). కాన్పు అయిన వెంటనే కనీసం విశ్రాంతి కూడా తీసుకోకుండా ఈత నేరుగా వేదికపైకి వచ్చి తన నృత్య ప్రదర్శనను కొనసాగించే హృదయాన్ని కదిలించే సంచలన దృశ్యాన్ని టీజర్‌లో ఆవిష్కరించారు. ఆ తర్వాత శ్రద్ధా కపూర్ తన నృత్య నైపుణ్యంతో, అద్భుతమైన హావభావాలతో ప్రేక్షకులను ఏ విధంగా మంత్రముగ్ధులను చేసిందో చాలా చక్కగా చూపించారు. సినిమా కథాంశాన్ని ఎక్కువగా బయటపెట్టకుండా కేవలం ప్రధాన పాత్ర తీవ్రతను, వైవిధ్యాన్ని మాత్రమే మేకర్స్ ఈ టీజర్‌లో ఎలివేట్ చేశారు. విఠాబాయి నారాయణగావ్‌కర్ జీవితంలో 1940 నుండి 1990 మధ్య కాలంలో జరిగిన కీలక ఘట్టాలను, ఎదుర్కొన్న సామాజిక వివక్షను, కళపై సదరు నర్తకికి ఉన్న అంకితభావాన్ని ఈ చిత్రం ద్వారా ప్రపంచానికి చూపించబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రణ్‌దీప్ హుడా, మహ్మద్ జీషాన్ అయూబ్, అనంత్ జోషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మ్యాడక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దినేష్ విజన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. లక్ష్మణ్ ఉటేకర్, మడాక్ ఫిల్మ్స్ కలయికలో వస్తున్న చిత్రం కావడంతో సహజత్వానికి, భావోద్వేగాలకు పెద్దపీట వేస్తారనే భావన ఉంది. మహారాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా ఈ చిత్రాన్ని మడాక్ ఫిలింస్ నిర్మిస్తోందని సమాచారం. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఈ టీజర్ వైరల్‌గా మారింది. గర్భిణీగా శ్రద్ధా కపూర్ చూపించిన నటన, లావణి నృత్యకారిణిగా మేకోవర్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. శ్రద్ధా కపూర్ కెరీర్‌లోనే ఇది అత్యంత కఠినమైన, వైవిధ్యమైన పాత్రగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని రక్షాబంధన్ కానుకగా ఆగస్టు 28 న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

## చరణ్ ఈమధ్య ఎందుకిలా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది మూవీ సక్సెస్ ను ఆస్వాదిస్తున్నప్పటికీ, ఇటీవల ఆయన చేసిన కొన్ని కామెంట్స్ మాత్రం సోషల్ మీడియాలో చర్చకు దారి తీస్తున్నాయి. సినిమా ప్రమోషన్స్ సమయంలో జరిగిన చిన్న చిన్న పొరపాట్లు వరుసగా ట్రోలింగ్ కు కారణమవుతుం డటంతో.. చరణ్ ఈమధ్య ఎందుకిలా? అనే ప్రశ్న అభిమానుల్లో ఇప్పుడు వినిపిస్తోంది. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన పెద్ది రీసెంట్ గా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజైంది. సినిమా విడుదలకు ముందు మేకర్స్ మధ్యప్రదేశ్ భోపాల్



లో భారీ ఈవెంట్ నిర్వహించారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ లో మూవీ రూపొందడంతో ఆ ఈవెంట్ లో రామ్ చరణ్ కు స్పోర్ట్స్ పర్సన్స్ పై ర్యాపిడ్ ఫైర్ రౌండ్ నిర్వహించారు హోస్ట్. సచిన్, ధోనీ, కోహ్లీ, రోహిత్ శర్మ వంటి క్రికెటర్ల గురించి అడిగిన ప్రశ్నలకు చరణ్ వెంటనే సమాధానాలు ఇచ్చారు. అయితే జస్ప్రీత్ బుమ్రా పేరు వచ్చినప్పుడు మాత్రం ఆయన పొరపాటున ఫుట్ బాల్ ప్లేయర్ గా భావించి ఆన్సర్ ఇచ్చారు. తాను పెద్ద అభిమానినని కూడా చెప్పారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున ట్రోలింగ్ మొదలైంది. అయితే వివాదం మరింత పెద్దదిగా మారకముందే చరణ్ స్పందించారు. బుమ్రాకు సారీ చెబుతూ, జనాల హడావుడి మధ్య అనుకోకుండా జరిగిన పొరపాటేనని వివరించారు. కొన్నిసార్లు పేర్ల విషయంలో తాను మర్చిపోతున్నానని, కావాలని చేసిన తప్పు కాదని స్పష్టం చేశారు. దీంతో ఆ వివాదానికి తెరపడింది. అయితే తాజాగా మరో విషయం నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. పెద్ది పోస్ట్ ప్రమోషన్స్ లో భాగంగా అటెండ్ అయిన ఓ ఈవెంట్ లో చరణ్ బ్లాక్ బస్టర్ హిట్ మూవీ ధురంధర్ గురించి మాట్లాడారు. తాను ఆ చిత్రాన్ని లాస్ట్ వీక్ చూసినట్లు పేర్కొన్నారు. అయితే ఆ కామెంట్ నే కొందరు నెటిజన్లు మరోసారి ట్రోలింగ్ కు ఫీడ్ గా మార్చుకున్నారు. దీనికి కారణం, సినిమా విడుదలైన వెంటనే రామ్ చరణ్ సోషల్ మీడియాలో ఆ చిత్రంపై ప్రశంసలు కురిపిస్తూ పోస్ట్ చేయడమే. ఇప్పుడు తాను ఇటీవలే సినిమా చూశానని చెప్పడంతో, మూవీ చూడకముందే ఎలా ప్రశంసించారని కొందరు ప్రశ్నిస్తున్నారు.

కానీ మెగా అభిమానులు మాత్రం ఆ విమర్శలను కంప్లీట్ గా ఖండిస్తున్నారు. చరణ్ ఉద్దేశం వేరే అని, ఆయన ఇటీవల ఓటీటీలో మరోసారి సినిమా చూశానని చెప్పి ఉండొచ్చని అంటున్నారు. ఒక మాటను మరో యాంగిల్ లో అర్థం చేసుకుని అనవసరంగా వివాదం సృష్టిస్తున్నారని చెబుతున్నారు. అయితే సోషల్ మీడియా జెనరేషన్ లో సెలబ్రిటీల ప్రతి కామెంట్, ప్రతి ఎక్స్ప్రెషన్ వెంటనే వైరల్ అవుతోంది. ముఖ్యంగా స్టార్ హీరోల విషయంలో చిన్న పొరపాట్లు కూడా పెద్ద చర్చలకు దారి తీస్తున్నాయి. రామ్ చరణ్ విషయంలో కూడా అదే జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సౌత్ స్టార్ హీరోయిన్లకు బాలీవుడ్‌లో తగిన గుర్తింపు రావట్లేదా?

దక్షిణాది సినీ పరిశ్రమల్లో స్టార్‌డమ్ సంపాదించిన పలువురు హీరోయిన్లు బాలీవుడ్‌లో అడుగుపెట్టిన తర్వాత వారి కెరీర్ గ్రాఫ్ పూర్తిగా మారిపోవడం కొత్త విషయం కాదు. సౌత్‌లో కథను మలుపు తిప్పే స్థాయిలో ప్రాధాన్యం ఉన్న క్యారెక్టర్లు చేసిన హీరోయిన్లు, హిందీ సినిమాల్లో మాత్రం తరచుగా పరిమిత పాత్రలకే పరిమితం అవుతున్నారనే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. తాజాగా ఒక ప్రముఖ సౌత్ హీరోయిన్ రష్మిక మందన్నా కు సంబంధించిన సోషల్ మీడియా చర్చలు ఈ అంశాన్ని మరోసారి హాట్ టాపిక్‌గా మార్చాయి. రీసెంట్ గా రష్మిక నటించిన కాక్‌టెయిల్2లో ఆమెకు మంచి ప్రాధాన్యత ఉన్న పాత్ర దక్కలేదనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తెలుగు, తమిళ సినిమాల్లో హీరోయిన్లకు కథలో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే సంప్రదాయం గత కొన్నేళ్లుగా పెరిగింది. ముఖ్యంగా పాన్ ఇండియా యుగం ప్రారంభమైన తర్వాత మహిళా పాత్రల ప్రాధాన్యం మరింత పెరిగింది. కానీ బాలీవుడ్‌లో పరిస్థితి అన్ని సందర్భాల్లో ఒకేలా కనిపించదని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. పెద్ద స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్ పాత్రలు చాలా సార్లు కథను ముందుకు నడిపే కంటే గ్లామర్ లేదా రొమాంటిక్ ట్రాక్‌కే పరిమితం అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో బాలీవుడ్‌లో అవకాశాలు అందుకున్న కొందరు సౌత్ హీరోయిన్ల కెరీర్‌ను పరిశీలిస్తే ఈ వాదనకు బలం చేకూరే ఉదాహరణలు కనిపిస్తాయి. సౌత్ లో తమ యాక్టింగ్ తో ప్రశంసలు అందుకున్న వారు హిందీలో మాత్రం గుర్తుండిపోయే పాత్రల కోసం చాలా కాలం ఎదురుచూడాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. కొందరికి భారీ హిట్లు దక్కినా, ఆ విజయాల్లో వారి పాత్రల కంటే సినిమా బ్రాండ్ లేదా హీరో ఇమేజ్ ఎక్కువగా చర్చకు రావడం కూడా గమనించదగ్గ అంశం. మరోవైపు సినీ వర్గాలు మాత్రం ఈ సమస్యను వేరే కోణంలో చూస్తున్నాయి. ఇది ప్రాంతీయత సమస్య కంటే పాత్రల ఎంపికకు సంబంధించిన విషయమనేది వారి అభిప్రాయం. బాలీవుడ్ అయినా, సౌత్ ఇండస్ట్రీ అయినా ప్రేక్షకులు చివరికి గుర్తుంచుకునేది బలమైన పాత్రలనే అంటున్నారు. స్క్రీన్ టైమ్ కంటే పాత్ర ప్రభావం ముఖ్యమని, సరైన కథ దొరికితే ఏ భాషలోనైనా నటీమణులు తమ ముద్ర వేయగలరని చెబుతున్నారు. అందుకే సౌత్ నుంచి బాలీవుడ్‌కు వెళ్లే స్టార్ హీరోయిన్లు కేవలం పెద్ద బ్యానర్లు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాకుండా, తమ టాలెంట్ ను పూర్తిగా చూపించే పాత్రల ఎంపికపై కూడా మరింత దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చిందా? అనే ప్రశ్న చుట్టూనే ఇప్పుడు డిస్కషన్ మొత్తం తిరుగుతుంది. ప్రస్తుతం జరుగుతున్న డిస్కషన్స్ చూస్తే ఈ ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నం ఇండస్ట్రీలోనే కాదు, ప్రేక్షకుల్లోనూ ప్రారంభమైనట్లు కనిపిస్తోంది.



Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662